## 11వ అధ్యాయం

# ప్రయాణీకుల, వ్యాధిగ్రస్తుల నమాజ్

# ١١ - بَابُ صَلاَةِ الْمُسَافِرِ وَالْمَرِيضِ

341. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "ప్రారంభకాలంలో రెండు రకతులు ఫర్జ్ (విధి) గావించబడ్డాయి. అంటే ఫర్జ్ గావించబడినవి రెండు రకతులే. అవి (ప్రయాణీకుల నమాజ్‌గా) మిగిల్చి ఉంచబడ్డాయి. సాధారణ (స్థితి లోని) నమాజ్ పరిపూర్ణం గావించ బడింది. (అంటే నాలుగు రకతులు చేయబడింది) (బుఖారీ, ముస్లిం)

(٣٤١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَوَّلُ مَا فُرِضَتِ الصَّلاَةُ رَكْعَتَانِ، فَأُقِرَّتْ صَلاَةُ السَّفَرِ، وَأُتِمَّتْ صَلاَةُ الْحَضَرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - "ఆయన (స) హిజ్రత్ చేసిన తరువాత నాలుగు రకతులు విధించ బడ్డాయి. ప్రయాణ నమాజ్ మాత్రం యధాతథంగా (మొదటి స్థితిలో) ఉంచ బడింది."

وَلِلْبُخَارِيِّ: ثُمَّ هَاجَرَ، فَفُرِضَتْ أَرْبَعاً، وَأُقِرَّتْ صَلاَةُ السَّفَرِ عَلَى الْأَوَّلِ.

وَزَادَ أَحْمَدُ: إِلاَّ الْمَغْرِبَ، فَإِنَّهَا وِتْرُ النَّهَارِ، وَإِلاَّ الصُّبحَ، فَإِنَّهَا تُطَوَّلُ فِيهَا الْقِرَاءَةُ.

అహ్మద్ ఈ వాక్యాన్ని అదనంగా చేర్చారు: "మగ్రిబ్ నమాజ్ తప్ప. ఎందుకంటే అవి పగటి వితర్. ఉదయం నమాజ్ కూడా యథాతథంగానే ఉంచబడింది. ఎందుకంటే ఈ నమాజ్‌లో ఖుర్‌ఆన్ పారాయణం సుదీర్ఘంగా ఉంటుంది."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే తొలి కాలంలో సాధారణ సమయాలలోనూ, ప్రయాణావస్థలోనూ రెండేసి రకతుల నమాజ్ మాత్రమే ఫర్జ్‌గా ఉండేది. తరువాత ప్రయాణావస్థ నమాజును యధాతథంగా వుంచి, సాధారణ స్థితిలో నమాజ్‌ను రెండింతలు చేయటం జరిగింది. అంటే రెండు రకతుల ఫర్జ్ నమాజ్ కాస్తా నాలుగు రకతులుగా చేయబడింది.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఖసర్ నమాజ్ గురించిన ప్రస్తావన వచ్చింది. ప్రయాణావస్థలో నమాజ్‌ను ఖసర్ చేయటం (తగ్గించటం) ధర్మసమ్మతమేనని అందులో చెప్పబడిందేగాని, ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అని మాత్రం అనబడలేదు.

ప్రయాణంలో ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అన్నది ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిమతం. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) లు మాత్రం ఖసర్‌ను సున్నత్ (దైవప్రవక్త) సంప్రదాయంగా తలపోస్తున్నారు.

దారె ఖుత్నీలో హ॥జత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ఈ విధంగా ఉంది - "ప్రయాణ సమయంలో నేను పూర్తి నమాజ్ చేశాను. దీనిగురించి ఆయన (సఅసం) కు తెలియజేయగా, ఆయన (స) మెచ్చుకున్నారు."

(٣٤٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقْصُرُ فِي السَّفَرِ وَيُتِمُّ، وَيَصُومُ وَيُفْطِرُ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَرُوَاتُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ مَعْلُولٌ، وَالْمَحْفُوظُ عَنْ عَائِشَةَ مِنْ فِعْلِهَا، وَقَالَتْ: إِنَّهُ لاَ يَشُقُّ عَلَيَّ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ.

342. హ॥జత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణ దినాలలో ఒక్కోసారి ఖసర్ చేసేవారు. ఒక్కోసారి పూర్తి నమాజ్ చేసేవారు. (అంటే రెండింటినీ అనుసరించేవారు). అలాగే ఉపవాసాలూ ఉండేవారు, ఇఫ్తార్ కూడా చేసేవారు '(దారె ఖుత్నీ). ఈ హదీసును అందజేసిన వారు విశ్వసనీయులు. కాని హదీసు అందిన పరంపరలో మాత్రం ఎక్కడో లింకు తెగింది. అయితే హ॥జత్ ఆయిషా (ర.అన్హా) గారి ఆచరణ రూపంలో ఇది సురక్షితంగా ఉంది. "ఉపవాసవ్రతం

నాకు భారమేమీ కాదు" అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వక్కాణించారు.

(బైహఖీ)

343. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "అల్లాహ్ రాయితీ నిచ్చిన విషయాలలో ఈ రాయితీలపై అమలు చేయటం ఆయనకెంతో ఇష్టం. ఆయన తన అవిధేయతను ఎంతగా ఇష్టపడడో అంతగానే (తన ప్రసాదిత సౌలభ్యాలను సద్వినియోగ పరచుకోవటాన్ని ఇష్టపడతాడు).

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్‌లు ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు). వేరొక ఉల్లేఖనంలో ఈ వాక్యం ఉంది - "తాను తాకీదు చేసిన ఆదేశాలను - ఫర్జ్‌లను - నెరవేర్చటాన్ని అల్లాహ్ ఇష్టపడినట్లే."

(٣٤٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللّٰهَ يُحِبُّ أَنْ تُؤْتَى رُخَصُهُ، كَمَا يَكْرَهُ أَنْ تُؤْتَى مَعْصِيَتُهُ». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وابْنُ حِبَّانَ، وَفِي رِوَايَةٍ: «كَمَا يُحِبُّ أَنْ تُؤْتَى عَزَائِمُهُ».

**సారాంశం**

ప్రయాణంలో నమాజ్‌ను ఖసర్ చేసి (తగ్గించి) చేయటం ఉత్తమమని ఈ హదీసు తాత్పర్యం. క్రియాత్మకంగా 4 రకతుల బదులు 2 రకతులే చేసినప్పటికీ ఇదే శ్రేష్ఠమయినది - ఎందుకంటే దేవుడు సమకూర్చిన సౌలభ్యాన్ని సద్వినియోగపరచుకోవటం దాసుల విజ్ఞతకు తార్కాణం. ఇది దైవానికి అత్యంత ప్రీతికరం.

344. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు మైళ్ళు, లేక మూడు 'ఫర్సఖ్'ల దూరం ప్రయాణం చేసినపుడు రెండు రకతుల (ఖసర్) నమాజ్ చేసేవారు."

(ముస్లిం)

(٣٤٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا خَرَجَ مَسِيرَةَ ثَلَاثَةِ أَمْيَالٍ أَوْ ثَلَاثَةِ فَرَاسِخَ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ مُسْلِمٌ.

**సారాంశం**

ఒక మైలుకు 8 ఫర్లాంగులు. ఒక 'ఫర్సిఖ్' మూడు మైళ్లకు సమానం. మూడు 'ఫర్సిఖ్'లు అంటే 9 మైళ్ళు అన్నమాట! అయితే ఈ 'దూరం' విషయంలో హదీసువేత్తల, ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ.లై), ఆయన ప్రియ అనుయాయి హాఫిజ్ ఇబ్నె ఖయ్యిం (రహ్మ.లై) ల అభిప్రాయం ప్రకారం ఖసర్ నమాజు కోసం ఇంతదూరం ప్రయాణించాలి అని ఖచ్చితంగా ఏమీ నిర్ధారితం కాలేదు. ఇమామ్ షూబ (రహ్మ.లై) గారు మూడు మైళ్లు లేక మూడు ఫిర్సిఖ్‌లు ప్రయాణిస్తే చాలు, ఖసర్ చేయవచ్చునని వ్యాఖ్యానించారు. హదీసులో కూడా ఈ మాటే అనబడింది. కొంతమంది ఈ దూరాన్ని 36 మైళ్లుగా, మరి కొందరు 48 మైళ్లుగా, ఇంకా కొందరు 56 మైళ్లుగా నిర్ధారించారు. వాస్తవానికి ఇవన్నీ అంచనాల ఆధారంగా నిర్ధారించుకున్నవే గాని వారి ఈ నిర్ధారణను సమర్థించే సహీహ్ హదీసు ఏదీ లేదు.

(٣٤٥) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ رَسُولِ اللّٰهِ ﷺ مِنَ الْمَدِينَةِ إِلَى مَكَّةَ، فَكَانَ يُصَلِّي رَكْعَتَيْنِ رَكْعَتَيْنِ، حَتَّى رَجَعْنَا إِلَى الْمَدِينَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

345. హజ్రత్ అనస్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి మదీనా నుండి మక్కా వరకు పయనించాము. ఆయన (సఅసం) తిరిగి వచ్చేదాకా రెండేసి రకతులే చేశారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

ప్రయాణ సంకల్పంతో మనిషి తన ఇంటి నుండి బయలుదేరినప్పటినుండీ అతడు బాటసారి గానే పరిగణించబడతాడు. పట్టణ పరిధిని దాటితే, అంటే నేటి ఆధునిక పరిభాషలో మునిసిపల్ పరిసరాలను లేక పంచాయితీ పొలిమేరలను దాటినప్పటినుండీ తిరిగివచ్చే వరకూ అతడు ప్రయాణీకుడే. ఈ మధ్య కాలంలో అతడు 'ఖసర్' చేయవచ్చు.

(٣٤٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَقَامَ النَّبِيُّ ﷺ تِسْعَةَ عَشَرَ يَوْماً يَقْصُرُ وَفِي لَفْظٍ: «بِمَكَّةَ، تِسْعَةَ عَشَرَ يَوْماً». رَوَاهُ الْبُخَارِيُّ، وَفِي رِوَايَةٍ لِأَبِي دَاوُدَ: «سَبْعَ عَشْرَةَ». وَفِي أُخْرَى: «خَمْسَ عَشْرَةَ».

346. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 19 రోజులపాటు ప్రయాణంలో (ఒకచోట ఆగి) వున్నారు. కాని ఆయన (స) 'ఖసర్' చేస్తూ వున్నారు. 'మక్కాలో 19 రోజులు ఉన్నార'ని వేరొక ఉల్లేఖనంలో ఉంది (బుఖారీ). అబూ దావూద్ ఉల్లేఖనంలో 17 రోజులు అని ఉంది. ఇంకొక ఉల్లేఖనంలో 15 రోజులని ఉంది.

وَلَهُ عَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ: «ثَمَانِيَ عَشْرَةَ». وَلَهُ عَنْ جَابِرٍ: أَقَامَ بِتَبُوكَ عِشْرِينَ يَوْماً يَقْصُرُ الصَّلاَةَ. وَرُوَاتُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي وَصْلِهِ.

అబూదావూద్‌లోనే ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది - "ఆయన(స) ఆగిన కాలం 18 రోజులు." "ఆయన (స) తబూక్‌లో 20 రోజులు ఆగారు. ఆగినన్ని రోజులూ ఖసర్ చేశారు" అని జాబిర్ (రజి) చెప్పారు. ఈ ఉల్లేఖనాన్ని అందజేసిన వారు విశ్వసనీయులేగాని, అసలిది ఎక్కడినుండి మొదలైంది అన్న విషయం వివాదాస్పదం అయింది. (అబూదావూద్)

## సారాంశం

మక్కాలో దైవప్రవక్త (సఅసం) ఆగిన రోజుల గురించి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 19 రోజులని కొందరూ, 17 రోజులని మరికొందరు, 18 రోజులని ఇంకొందరూ వాదించారు. ప్రతి ఒక్కరూ తమ తమ వాదనల కనుగుణంగా ఏదో ఒక ఆధారాన్ని ఉదాహరించారు. వాస్తవానికి ఇది దైవప్రవక్త (స) మక్కాను జయించినప్పటి సంఘటన. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆగిన గడువు కాదిది. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆయన (స) విచ్చేసినపుడు మొత్తం పది రోజులకన్నా ఎక్కువ ఉండలేదు. ఈ వివిధ ఉల్లేఖనాలను జోడించిన పిదప 19 రోజుల ఉల్లేఖనం ఇతర ఉల్లేఖనాలకన్నా దృఢంగా కనిపిస్తుంది. ఎందుకంటే దైవప్రవక్త (స) మక్కా విజయం సందర్భంగా - రమజాన్ నెల 17వ తేదీ మంగళవారం నాడు మక్కాలో ప్రవేశించారు. అక్కడి నుండి హునైన్ వైపునకు షవ్వాల్ మాసం 6వ తేదీన బయలుదేరారు. దాఖలైన రోజును, వెడలిపోయిన రోజును కలుపుకుంటే మొత్తం 19 రోజులవుతాయి.

అయితే ఈ 'అన్వయింపు' విషయంలో ధర్మవేత్తలమధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపాయి. ఒక్కొక్కరు ఒక్కో కోణం నుంచి ప్రయాణీకుని నిరీక్షణా గడువును నిర్ధారించారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల దృష్టిలో ఈ గడువు 3 రోజులు. ఇమామ్ అబూహనీఫా (రహ్మ.లై) దృష్టిలో 15 రోజులు. కాని ప్రయాణీకుని 'తిరుగు ప్రయాణ సమయం నిర్ధారితం కాక అతడు సందిగ్ధావస్థకు లోనైవుంటే అట్టి పరిస్థితిపై కూడా ఇమాముల మధ్య అభిప్రాయభేదం ఏర్పడింది. ఇలాంటి సందిగ్ధావస్థకు లోనై వున్న ప్రయాణీకుడు, అతడు తన స్థిరనివాసానికి చేరుకునేవరకూ ఖసర్ చేయవచ్చని ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయపడ్డారు. ఒకానొక కథనం ప్రకారం ఇమామ్ షాఫయి కూడా దీనికి మద్దతు తెలిపారు. ఈ అభిప్రాయాన్ని సమర్థించే సంఘటనలు కూడా ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) అజర్ బాయ్‌జాన్‌లో 6 నెలల దాకా 'ఖసర్' చేశారు. హజ్రత్ అనస్ (రజి) ఒక ప్రయాణంలో ఏడాది కాలం లేక రెండేళ్ళపాటు డోలాయమాన

స్థితిలో ఉండవలసి వచ్చింది. అప్పటివరకూ ఆయన ఖసర్ చేస్తూనే వున్నారు. కొంతమంది ప్రవక్త సహచరులు ఒక ప్రయాణంలో 9 మాసాల దాకా అనిశ్చిత స్థితికి లోనుకావలసి వచ్చింది. ఈ స్థితి తొలగిపోయేదాకా వారు ఖసర్ చేసినట్టు ఆధారాలున్నాయి. ఈ సంఘటనల ద్వారా అవగతమయ్యే దేమిటంటే ప్రయాణంలో మనిషి అనిశ్చిత స్థితికి, సందిగ్ధావస్థకు గురైవున్నంత కాలం 'ఖసర్' గడువు ఇదమిత్థంగా 'ఇంత' అని చెప్పజాలము. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా అతను ఎన్నాళ్ళయినా 'ఖసర్' చేయటం ధర్మసమ్మతమే.

(٣٤٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا ارْتَحَلَ قَبْلَ أَنْ تَزِيغَ الشَّمْسُ، أَخَّرَ الظُّهْرَ إِلَى وَقْتِ الْعَصْرِ، ثُمَّ نَزَلَ فَجَمَعَ بَيْنَهُمَا، فَإِنْ زَاغَتِ الشَّمْسُ قَبْلَ أَنْ يَرْتَحِلَ صَلَّى الظُّهْرَ ثُمَّ رَكِبَ. مُتَّفَقٌ عَلَيْهِ.

347. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సూర్యుడు (పడమటి దిక్కున) వాలక ముందే ప్రయాణానికి బయలుదేరి వుంటే జుహ్ర్ నమాజును అస్ర్ నమాజ్ వేళ వరకూ చేయకుండా వాయిదా వేసే వారు. ఆ తర్వాత వాహనం దిగి జుహ్ర్ అస్ర్ నమాజులను ఒకేసారి నెరవేర్చే వారు. ఒకవేళ ప్రయాణానికి బయలు దేరక ముందే సూర్యుడు (పడమటి దిశన) వాలిపోయి వుంటే, అప్పుడు జుహ్ర్ నమాజ్ చేసి ప్రయాణం కట్టేవారు. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةِ الْحَاكِمِ فِي الْأَرْبَعِينَ بِالْإِسْنَادِ الصَّحِيحِ: صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ ثُمَّ رَكِبَ.

హాకిమ్ గారి 'అర్బయీన్'లో ఒక ప్రామాణిక ఆధారం ఇలా ఉంది: "ఆయన (స) జుహ్ర్, అస్ర్ నమాజులను (ఒకేసారి) చేసి ప్రయాణానికి బయలుదేరారు."

وَلِأَبِي نُعَيْمٍ فِي مُسْتَخْرَجِ مُسْلِمٍ: كَانَ إِذَا كَانَ فِي سَفَرٍ فَزَالَتِ الشَّمْسُ صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ جَمِيعاً، ثُمَّ ارْتَحَلَ.

అబూ నుఐమ్ గారి "ముస్తఖ్రజ్"లో ఇలా వుంది - "ఆయన (స) ప్రయాణంలో నున్నప్పుడు, పొద్దు వాలిన తరువాత జుహ్ర్ మరియు అస్ర్ - రెండింటినీ కలిపి చేసేవారు. ఆ తరువాత ముందుకు సాగిపోయేవారు.

348. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : "మేము తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసం) వెంట ఉన్నాము. ఆయన (స) జుహ్ర్ - అస్ర్ నమాజులను కలిపి చేసేవారు. మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి ఒకేసారి చేసే వారు." (ముస్లిం)

(٣٤٨) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ النَّبِيِّ ﷺ فِي غَزْوَةِ تَبُوكَ، فَكَانَ يُصَلِّي الظُّهْرَ وَالْعَصْرَ جَمِيعاً. رَوَاهُ مُسْلِمٌ.

349. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : నాలుగు 'బురుద్'ల కన్నా తక్కువ దూరం వుంటే ఖసర్ నమాజ్ చేయకండి. నాలుగు బురుద్‌లంటే మక్కా నుండి 'ఉస్ఫాన్' వరకు గల దూరం. (దీనిని దారె ఖుత్నీ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు. వాస్తవానికి ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. ఇబ్నె ఖుజైమ కూడా దీనిని ఈ విధంగానే ఉల్లేఖించారు)

(٣٤٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنهما قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «لَا تَقْصُرُوا الصَّلَاةَ فِي أَقَلَّ مِنْ أَرْبَعَةِ بُرُدٍ، مِنْ مَكَّةَ إِلَى عُسْفَانَ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَالصَّحِيحُ أَنَّهُ مَوْقُوفٌ، كَذَا أَخْرَجَهُ ابْنُ خُزَيْمَةَ.

**సారాంశం**

'బురుద్' అనేది బహు వచనం. ఏకవచనంలో 'బరీద్' గా వ్యవహరిస్తారు. ఒక బరీద్ 12 మైళ్ళకు సమానం. 4 బురుదులంటే మొత్తం 48 మైళ్ళు అవుతాయి.

4 బురుదులకన్నా తక్కువ దూరం ప్రయాణిస్తే ఖసర్ ధర్మసమ్మతం కాదంటూ హదీసును అందజేసిన వ్యక్తి నమ్మదగిన వ్యక్తి కాడు. అతడు హదీసుకు అబద్ధాన్ని అంటగట్టాడు. ఇమామ్ సౌరీ (రహ్మ.లై) అతన్ని కజ్జాబ్‌గా అభివర్ణించారు. ఇబ్నె అబ్బాస్ (రజి) స్వయంగా మక్కా-తాయఫ్‌ల మధ్య ప్రయాణం చేసినపుడు ఖసర్ చేసేవారని ఆధారాలున్నాయి. మక్కా - ఉస్ఫాన్‌ల మధ్య, మక్కా - జెద్దాల మధ్య కూడా ఆయన ఖసర్ చేసేవారని ఇమామ్ మాలిక్ తన 'మువత్తా' లో నకలు చేశారు.

350. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు - "నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో అత్యుత్తములెవరంటే,

(٣٥٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «خَيْرُ أُمَّتِي الَّذِينَ

إِذَا أَسَاءُوا اسْتَغْفَرُوا، وَإِذَا سَافَرُوا قَصَرُوا وَأَفْطَرُوا». أَخْرَجَهُ الطَّبَرَانِيُّ فِي الْأَوْسَطِ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَهُوَ فِي مَرَاسِيلِ سَعِيدِ بْنِ الْمُسَيَّبِ عِنْدَ الْبَيْهَقِيِّ مُخْتَصَراً.

వారు తప్పులు చేసి క్షమాపణకై వేడుకుంటారు. ప్రయాణంలో ఉన్నప్పుడు ఖసర్ నమాజ్ చేస్తారు. ఉపవాసం ఉండరు." (దీనిని తబ్రానీ బలహీన ఆధారంతో తన 'ఔసత్'లో ఉల్లేఖించారు. బైహఖీలో సయీద్ బిన్ ముసైబ్ ఆధారంగా సంక్షిప్తంగా దీని గురించి వివరించబడింది)

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన వారిలో ఒకరైన సయీద్ బిన్ ముసైబ్ (రహ్మ.లై) తాబయీన్ల నాయకునిగా ప్రసిద్ధిచెందారు. గొప్ప పండితులు. హదీసు, ఫికహ్, దైవధ్యానం, ఆరాధనలు, తఖ్వా (దైవభక్తి) తదితర అంశాలపై ఎంతో జ్ఞానసంపదను సమకూర్చారు. విద్యల క్రోడీకరణలో ప్రవీణులు. ఈయన హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ మొదలయిన రెండు సంవత్సరాలకు జన్మించారు. హిజ్రీ 90 లో మరణించారు.

(٣٥١) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَتْ بِي بَوَاسِيرُ، فَسَأَلْتُ النَّبِيَّ ﷺ عَنِ الصَّلَاةِ، فَقَالَ: «صَلِّ قَائِماً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَقَاعِداً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَعَلَى جَنْبٍ». رَوَاهُ الْبُخَارِيُّ.

351. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : నేను మొలల వ్యాధితో బాధపడేవాణ్ణి. ఈ స్థితిలో నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను సంప్రతించి నమాజ్ ఎలా చేయాలని అడిగాను. ఆయన (సఅసం) ఈ సలహా ఇచ్చారు-"నిలబడి (నమాజ్) చేయండి. ఒకవేళ నిలబడి చేయలేకపోతే కూర్చుని చేయండి. కూర్చుని చేయడానికి కూడా వీలుపడకపోతే ఒక ప్రక్కకు ఒత్తిగిలి నమాజ్ చేయండి." (బుఖారీ)

## సారాంశం

అయితే ఎలా కూర్చుని నమాజ్ చేయాలి? కాళ్లు మడతపెట్టుకుని కూర్చోవాలా? లేక తషహ్హుద్ స్థితిలో కూర్చున్నట్లు కూర్చోవాలా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వ్యాధిగ్రస్తుడు ఎలా కూర్చోగలిగితే అలాగే కూర్చుని నమాజ్ చేయవచ్చు. పడుకొని నమాజ్ చేసేటప్పుడు కూడా ఎలా వీలుంటే అలా చేయవచ్చు.

(٣٥٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: عَادَ النَّبِيُّ ﷺ مَرِيْضاً، فَرَآه يُصَلِّي عَلَى وِسَادَةٍ فَرَمَى بِهَا، وَقَالَ: «**صَلِّ عَلَى الأَرْضِ إِنِ اسْتَطَعْتَ، وَإِلاَّ فَأَوْمِ إِيْمَاءً، وَاجْعَلْ سُجُودَكَ أَخْفَضَ مِنْ رُكُوعِكَ**». رَوَاهُ الْبَيْهَقِيُّ، وَصَحَّحَ أَبُو حَاتِمٍ وَقْفَهُ.

352. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రోగిని పరామర్శించారు. అతడు దిండుపై నమాజ్ (సజ్దా) చేస్తున్నాడు. దైవప్రవక్త (స) ఆ దిండును తీసిపార వేశారు. "నీకు వీలుపడితే నేలపై నమాజ్ చెయ్యి. లేకుంటే తల ఊపుతూ నమాజ్ చెయ్యి. సజ్దా చేయవలసి వచ్చినపుడు మాత్రం రుకూ కన్నా కాస్త క్రిందికి తలను వంచు." (బైహఖీ దీనిని ఉల్లేఖించారు. అబూ హాతిమ్ గారు ఇది 'మౌఖూఫ్' కావటాన్ని నిజమని ఖరారు చేశారు)

(٣٥٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْها قالت: رَأَيْتُ النَّبِيَّ ﷺ يُصَلِّيْ مُتَرَبِّعاً رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

353. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను కాళ్లు మడత పెట్టుకుని నమాజ్ చేయగా చూచాను." (దీనిని నసాయి ఉల్లేఖించారు - హాకిమ్ గారు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)